క్లుప్తంగా

కాంట్రాక్ట్ కార్మికులంటే నిర్లక్ష్యమా?

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుడు అంతడపుల శంకర్(50) విధుల్లో ఉండగా వడదెబ్బ బారిన పడి మృతి చెందినా, అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని ఇఫ్టూ నాయకులు ఎస్.కే.యాకూబ్‌షావలీ, తోకల రమేష్ విమర్శించారు. కొత్తగూడెంలో ఆదివారం వారు మాట్లాడుతూ.. రుద్రంపూర్‌లో విధులు నిర్వర్తిస్తున్న శంకర్ గురువారం ఎండతో సొమ్మసిల్లి పడిగా కొత్తగూడెం ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని తెలిపారు. అయితే, అధికారులు కార్మికుల విషయంలో రక్షణ చర్యలు పాటించకపోవడంతోనే ఈ ఘటన జరిగినందున కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు బోనాలు

ఇల్లెందురూరల్: మండలంలోని చల్లసముద్రం పంచాయతీ వేములవాడ గ్రామంలో దేవతల ప్రతిష్ఠ నిర్వహించుకొని మూడేళ్లు పూర్తయిన సందర్భంగా గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి బోనంతో ప్రదర్శనగా వచ్చిన మహిళలు అమ్మవార్లకు బోనాన్ని నైవేద్యంగా సమర్పించారు. ఆలయం వద్ద సాంప్రదాయ నృత్యలతో పలువురు అలరించారు.

దాడి చేసిన మహిళపై కేసు

పాల్వంచరూరల్: మహిళపై దాడికి పాల్పడిన మరో మహిళపై కేసు నమోదైంది. మండలంలోని నాగారం కాలనీకి చెందిన జర్పుల లక్ష్మిపై వరసకు వదిన అయ్యే బోడ పాలి ఆదివారం గొడవ పడి రాయితో కొట్టింది. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పాలిపై కేసు నమోదుచేసినట్లు ఏఎస్సై సుధాకర్ తెలిపారు.

లారీ బోల్తా, ఇద్దరికి గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం సమ్మక్క, సారలమ్మ గద్దెల సమీపాన ఆదివారం లారీ బోల్తా పడ్డ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కర్ణాటక రాష్ట్రం నుంచి పాల్వంచ వెళ్తున్న లారీ గద్దెలు దాటాక టైర్ల నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు కాగా ఇల్లెందులో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

ఉద్యమానికి ఊపిరి పోసింది న్యూడెమోక్రసీనే..

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరి పోసింది న్యూడెమోక్రసీనేనని సీపీఐ(ఎంఎల్) ఎన్డీ రాష్ట్ర నాయకులు గోవర్దన్ అన్నారు. ఆదివారం కొత్తగూడెంలోని రైటర్‌బస్తీలోని ఇఫ్టూ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావం– ప్రజల ఆకాంక్షలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరుల బలిదానాలు, ప్రజల ఆకాంక్షలను పాలకులు మర్చిపోయారన్నారు. 4 కోట్ల తెలంగాణ ప్రజలకు, రైతులకు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎదల్లపల్లి సత్యం, గౌని అయిలయ్య, జి.అనురాధ, జే.సీతారామయ్య, ఎండీ రాసుద్దీన్, విశ్వనాథం, మోకాళ్ల రమేష్, బయ్యశారద, ఆదిలక్ష్మీ, హరిజ, గోపాల్, భానుచందర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయండి



ప్రచారం చేస్తున్న నాయకులు

టేకులపల్లి: ఈనెల 9న కొత్తగూడెంలో జరిగే ఆలిండియా ట్రైబల్ ఫోరం రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఫోరం బాధ్యుడు గొగ్గెల బుచ్చయ్య అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని కుమురంభీం బజారులో సదస్సు కరపత్రాలను అందజేసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆదివాసీలకు మూలాధారమైన అడవిని కార్పొరేట్ శక్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాకట్టు పెట్టి, 89 రకాల ఖనిజ సంపదలను దోచుకోవడం కోసం ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. అడవుల నుంచి ఆదివాసీలను దూరం చేసేందుకు మావోయిస్టుల పేరుతో కాల్పులు జరుపుతూ అనేక మంది ప్రాణాలు తీస్తున్నారన్నారు. మరోపక్క భూమిలేని పేదవారందరూ పోడు భూమి సాగు చేసుకుంటే ఆ భూములకు పట్టాలు ఇవ్వకుండా ఫారెస్ట్ వారితో ట్రెంచ్లు వేసి వారిని నిరాశ్రయులుగా మార్చి వేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఈ నూతన అటవీ సంరక్షణ నియమాలను రద్దు చేయాలని, అడవిపై ఆదివాసీలకు హక్కులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోగ్గేల చిన్న రాములు, పూనెం మల్లేష్, చింత కోటయ్య, వజ్జ సమ్మయ్య, భోగా కోటయ్య, కల్తీ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగాల ఫలితమే తెలంగాణ



గౌరవవందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రియాంక అల, పక్కన ఎస్పీ రోహిత్‌రాజ్

ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

ఎందరో ఉద్యమకారులు, అమరుల త్యాగాలతోనే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని పలువురు అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్, పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అమరవీరులను స్మరించుకుంటూ నివాళులర్పించారు. పలువురు ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలు వేసి నమస్కరిస్తున్న సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు



జాతీయ జెండా ఎగురవేస్తున్న కలెక్టర్ ప్రియాంక



సింగరేణి ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండా ఎగరేస్తున్న సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు



ప్రకాశం స్టేడియంలో గౌరవవందనం స్వీకరిస్తున్న సింగరేణి సీఎండీ ఎన్.బలరాం



తెలంగాణ రన్‌లో పాల్గొన్న సింగరేణి అధికారులు



ఇల్లెందు: కొమ్ము కోలాటం పరుగులో పాల్గొన్న జీఎం జాన్ ఆనంద్



చుంచుపల్లి: జెడ్పీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు



పాల్వంచ: పొంగులేటి కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల



పాల్వంచ: కేటీపీఎస్ 5,6 దశల కర్మాగారంలో మాట్లాడుతున్న సీఈ ఎం.ప్రభాకర్ రావు



కేటీపీఎస్ 7వ దశలో పాల్గొన్న జెన్‌కో డైరెక్టర్ బి.లక్ష్మయ్య, అధికారులు



ఇల్లెందు: మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ డీవీ, కమిషనర్ యాదగిరి తదితరులు



అమరులకు నివాళులర్పిస్తున్న డీఎస్పీ చంద్రభాను, సీఐ కరుణాకర్



జూలూరుపాడు: తహసీల్దార్ కార్యాలయంలో..



సుజాతనగర్: పోలీస్‌స్టేషన్‌లో జెండా ఎగరేస్తున్న ఎస్సై జుబేదా బేగం



ఇల్లెందురూరల్: తహసీల్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రవికుమార్



కొత్తగూడెంరూరల్: డీసీసీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



పాల్వంచరూరల్: జలవనరులశాఖ సీఈ కార్యాలయంలో సీఈ శ్రీనివాసరెడ్డి



పాల్వంచరూరల్: సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ కార్యాలయంలో ప్రత్యేక ఉపకలెక్టర్ కార్తీక్



కొత్తగూడెంఅర్బన్: మున్సిపల్ కార్యాలయంలో..



బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నినాదాలు చేస్తున్న ఉద్యమకారులు



టేకులపల్లి: పోలీస్ స్టేషన్‌లో

ఉద్యమ పురిటిగడ్డ ఇల్లెందు

ఇల్లెందు: తెలంగాణ ఉద్యమ ఆకాంక్షను బహిర్గతం చేసి పురిటి గడ్డగా మార్చిన ఇల్లెందుకు ప్రత్యేక స్థానం ఉందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం ఇల్లెందులోని తన క్యాంపు కార్యాలయం వద్ద 62 మంది తెలంగాణ ఉద్యమకారులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకనాడు పాల్వంచ పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగాలు లభించకపోవటంతో ముల్కీ, నాన్ ముల్కీ ఉద్యమం మొదలైందని, ఆ ఉద్యమానికి పురుగు పోసింది ఇల్లెందుకు చెందిన కొలిశెట్టి రాందాస్ అన్నారు. 1967 తొలి దశ, మలి దశ ఉద్యమంలోనూ ఇల్లెందు అగ్రస్థానం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జానీపాషా, గడ్డం వెంకటేశ్వర్లు, పడిదల నవీన్, మునుగునూరు రమేష్, రాంచందర్, ఖాజాపాషా, మేకల శ్యామ్, దొడ్డా డానియేల్, మడుగు సాంబమూర్తి, సూర్యం, చిల్లా శ్రీనివాస్, గ్రంధి సదానందం పాల్గొన్నారు.



ఉద్యమకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

కార్మిక వర్గ పక్షపాతి పర్సా



నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందు: సింగరేణి సంస్థలో గుమస్తాగా చేరి కార్మికుల సమస్యలపై నిరంతరం పాటుపడిన నేత పర్సా సత్యనారాయణ అని సీపీఎం నాయకులు పిట్టల రవి, మండల కార్యదర్శి నబీ అన్నారు. పర్సా సత్యనారాయణ జయంతి సందర్భంగా పార్టీ పట్టణ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పర్సా శత జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వరాజ్య పోరాటం, తెలంగాణ పోరాటంలోనూ, నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడి జైలు జీవితం గడిపాడని తెలిపారు. నాయకులు కృష్ణ, ఆలేటి కిరణ్, మోహన్‌రావు, సీహెచ్ శ్రీనివాస్, సంతోష్, వెంకన్న పాల్గొన్నారు.

నివాళి

చుంచుపల్లి: కాంగ్రెస్ పార్టీ నాయకుడు, గురుస్వామి నంబుదూరి సూర్య ప్రకాష్‌రావు మృతి పార్టీకి తీరనిలోటని జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందిన సూర్యప్రకాష్‌రావు మృతదేహాన్ని ఆదివారం సందర్శించి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు ఆళ్ల మురళి,తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల పండుగ

ఇల్లెందురూరల్: వానాకాలం సీజన్ ప్రారంభం అవుతుండటంతో మండలంలోని రేపల్లెవాడ గ్రామానికి చెందిన ఆదివాసీలు ఆదివారం విత్తనాల పండుగను ఘనంగా సాంప్రదాయపద్ధతిలో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆదివాసీ రైతులు ఒక సమూహమై తమ ఇలవేల్పులకు, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజ చేశారు. అమ్మవార్లకు బలిచ్చిన జంతువుల రక్తంలో విత్తనాలను తడిపి సాగు చేసుకుంటున్న చేలలో చల్లారు.



గ్రామదేవతకు పూజ చేస్తున్న రైతులు

పచ్చిరొట్ట సాగు.. లాభాలు బాగు

- తొలకరిలో జనుము, జీలుగ సాగు
- అందుబాటులో విత్తనాలు

సుజాతనగర్: రైతులు అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో పొలాల్లో రసాయన ఎరువులను చల్లుతున్నారు. దీంతో భూసారం దెబ్బతింటోంది. భూసారం, దిగుబడి పెంచేందుకు పచ్చిరొట్ట సాగు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ మేరకు రైతులను ప్రోత్సహించేందుకు జనుము, జీలుగ పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం 65 శాతం సబ్సిడీపై అందజేస్తుంది.

పచ్చిరొట్ట ఎరువులంటే..

పచ్చిరొట్ట ఎరువులను పంట భూమికి రెండు రకాలుగా అందించవచ్చు. మొదటి పద్ధతిలో జనుము, జీలుగ, పిల్లి పెసర, ఉలవ, పెసర, అలిసంద, గోరు చిక్కుడు, మినుము, కంది, వేరుశెనగ, వెంపలి వచ్చిరొట్ట విత్తనాలను పొలంలో వెదజల్లి, అవి పెరిగిన తర్వాత 50 శాతం పూతదశలో (45–60 రోజుల సమయంలో) అదే పొలంలో కలియదున్నాలి. అవి కుళ్లిన తర్వాత ప్రధాన పంట వేసుకోవాలి. రెండో పద్ధతిలో వేప, తంగెడు, కానుగ, సుబాబుల్, గుల్‌మోహర్ చెట్ల ఆకులు, కొమ్మలను బయట నుంచి సేకరించి పొలంలో వేసి కలియదున్నాలి. పొలంలో మురిగిన తర్వాత పంట వేసుకోవాలి. వరి సాగుచేసే రైతులు తొలకరి వర్షాలు పడగానే పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే, పొలం సిద్ధం చేసే సమయానికి పూతకు వస్తుంది. ఆ సమయంలో పొలంలో దున్ని వరి సాగు చేసుకోవచ్చు. పండ్ల తోటల రైతులు జనుము, జీలుగ చల్లుకుంటే పెద్దగా రసాయన ఎరువులు చల్లాల్సిన అవసరం ఉండదు.

ఉపయోగాలివే..

పచ్చిరొట్ట పంటల్లో సేంద్రియ పదార్థం ఉంటుంది. దీంతో భూసారం పెరుగుతుంది. భూమిని గుల్లపరిచి, నీటి నిల్వ సామర్థ్యం పెంచుతుంది. పంట భూమిలో వృథాగా ఉండే పోషకాలను ఉపయోగంలోకి తేస్తాయి. కలుపు మొక్కలు పెరగకుండా నివారిస్తుంది. ఈ జాతి పంటలకు వేర్లు లోతుగా ఉండి భూమి లోపలి పొరలను కూడా ఉపయోగంలోకి తేస్తాయి. పంటల్లో సూక్ష్మపోషక పదార్థాల లోపాలు రాకుండా చేయడంతో పాటు, నులి పురుగుల ఉధృతిని తగ్గిస్తాయి.



పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

● జీలుగు..

చౌడు భూములతో పాటు వరి పండించే భూముల్లో ఎకరాకు 20 కిలోల జీలుగ పచ్చిరొట్ట విత్తనాలను పొలమంతా చల్లాలి. జీలుగను పూత దశలో కలియదున్నడం వల్ల ఎకరాకు 6–8 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. ఎకరం పచ్చిరొట్టలో 30–32 కిలోల నత్రజని లభిస్తుంది. జీలుగలో 3.5 శాతం నత్రజని, 0.6 శాతం భాస్వరం, 1.2 శాతం పొటాష్ లభిస్తుంది. నీరు నిలిచినా పంట తట్టుకుంటుంది.

● జనుము..

అన్ని పంట భూముల్లో సాగు చేసుకోవచ్చు. పచ్చిరొట్టగా, పశువుల మేతగా ఉపయోగపడుతుంది. ఎకరానికి 9.2 నుంచి 14 కిలోల విత్తనం చల్లాలి. ఈ పంట ద్వారా ఎకరానికి 5.2 నుంచి 6 టన్నుల పచ్చిరొట్ట వస్తుంది. ఇందులో 2.3 శాతం నత్రజని, 0.5 శాతం భాస్వరం, 1.8 శాతం పొటాష్‌లు ఉంటాయి. త్వరగా పెరుగుతుంది. నీటి ఎద్దడి, మురుగునీటిని తట్టుకోదు.

● పెసర..

ఈ పంటను తేలిక, బరువైన నేలల్లో సాగు చేసుకోవచ్చు. దీన్ని ఆహారంగా, పచ్చిరొట్ట ఎరువుగా, పశువులకు మేతగా ఉపయోగించవచ్చు. చౌడు భూముల్లో సాగుకు పనికి రాదు. ఎకరానికి 12 కిలోల విత్తనం అవసరం. ఎకరానికి 15.2 కిలోల నత్రజని అందుతుంది. ఎకరాకు అలసంద ద్వారా 4–5 టన్నులు, పిల్లి పెసర ద్వారా 4–6 టన్నుల పచ్చిరొట్ట వస్తుంది. అంతేకాకుండా, వ్యవసాయ బావులు, గట్ల వెంబడి ఉండే చెట్ల కొమ్మలు, ఆకులను పొలంలో వేసి కలియదున్నితే ఎంతో లాభం.

ఏటా సాగు చేస్తున్నా..



వరి పొలంలో ఏటా జీలుగ సాగు చేస్తున్నా. ఇది రెండు పంట సీజన్లలోనూ ఎంతగానో ఉపయోగపడు తుంది. దీంతో రసాయన ఎరువుల వాడకం తగ్గుతోంది. భూమి సారవంతంగా మారుతుంది. అధిక దిగుబడి, లాభాలు సాధించవచ్చు.

– లావుడ్యా బాలోజీ, రైతు, నర్సింగ్ తండా

దిగుబడి పెరుగుతుంది



ప్రధాన పంటలకు ముందు జనుము, జీలుగ, పప్పుధాన్యాల పంటలు సాగు చేయడంతో భూమికి సత్తువ వస్తుంది. దిగుబడులు పెరుగుతాయి. రసాయన ఎరువులు పెద్దగా వేయాల్సిన అవసరం ఉండదు. పచ్చిరొట్ట విత్తనాలను పొలాల్లో వేసి అందులోనే కలియదున్నితే లాభం.

– జి.నర్మద, మండల వ్యవసాయాధికారిణి, సుజాతనగర్